ఇండియా టుడే - 28 డిసెంబర్, 1998

# మిత్రలాభం

ఆ సాయంత్రం రాజారావు ఇంటి ముందు లాన్‌లో కూర్చుని స్నేహితుడు, సహోద్యోగి అయిన ముకుందరావుతో పిచ్చాపాటీలోకి దిగాడు. వాళ్ళిద్దరూ మంచి ఉద్యోగాలు చేసి రెండు చేతులా గడించి, ఏడాది క్రితమే రిటైరై, స్వయంగా కట్టుకున్న ఇళ్ళల్లో సెమీ వానప్రస్థం రుచి చూస్తున్నారు. వారిద్దరికీ పెద్దగా బాదరబందీలు లేవు. అయితే, రెండిళ్ళలోనూ పెళ్ళికాకుండా ఒక్కో శాల్తీ మాత్రం మిగిలిపోయారు. ఇద్దరికీ మంచి

సంబంధాలు అవే దొరుకుతాయని వాళ్ళకు ధైర్యం. అందుకే ఇద్దరూ తమతో పాటు రిటైరైన వాళ్ళతో చేరి గత కాలపు వైభవాలను నెమరువేసుకుంటూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. ఏ ఏ స్నేహితుడు ఎలా ఉన్నదీ, వారి వారి సంతానాల ద్వారా ఎదురయ్యే సుఖదుఃఖాలకు ఎలా స్పందిస్తున్నదీ చర్చించుకుంటారు. అలాగే ఒక్కొక్కసారి ఎదురైన అనుకోని ఖర్చులకు, అనుకోకుండా కుటుంబ సభ్యుల మీదకు ఉరికిన అనారోగ్యాలకు విలవిలలాడతారు. ఆ వెను వెంటనే అంత భారాన్నీ అంతర్యామి పరం చేసేస్తారు.

ఆ వేళ మాటల్లో, ఆ క్రితం ఇంటిల్లిపాదితో కలసి పండుగ చేసుకుంటూ, నవ్వుల మధ్య తేలియాడుతూ, అంతలోనే హార్ట్ ఎటాక్‌కి బలి అయిన జోగారావును తలచుకొని సానుభూతిగా మాట్లాడుకున్నారు. ఆ పైన తమతో పాటు తమ సెక్షన్లో పని చేసి రెండేళ్ళుగా పక్షవాతంతో మంచం మీద పడి తీసుకుంటున్న రామారావును గుర్తు చేసుకున్నారు.

“ఇంతవరకు ఏదో కాలూ చేయీ ఆడుతున్నాయి. రేపేదైనా అయితే నన్నెవరు చూస్తారు? మా ఆవిడ పార్వతికి కూర్చుంటే ఆయాసం, నిల్చుంటే ఆయాసం. ఇక కోడళ్ళిద్దరూ చెరో పెడా చేరి తన బి.పి. పెంచుతున్నారంటుంది. మనం ఏమనడానికీ లేదు. దానికేమవుతుందోనని నేనూ, నాకేమవుతుందోనని అదీ యతిప్రాసలు కుదరని ద్విపద కవితలా బతకును లాక్కొస్తున్నాం. నీకేం ముకుందం కొడుకులు లేరు. ముగ్గురూ కూతుళ్ళే. హాయి” అన్నాడు రాజారావు.

“నా మాటే చెప్పుకోవాలి. మా ఇల్లు ఓ మినీ లంకా నగరం అనుకో. కూతుళ్ళు అవునంటే అల్లుళ్ళు కాదంటారు. ఎడమొహాలు పెడమొహాలు వాళ్ళను సముదాయించే సరికి అయిదో ప్రాణం కోమాలోకి వస్తోంది. ఇక మనుమలు.... వాళ్ళూ గడుగ్గాయిలే. ఒకడు శంకరాచార్యులు, మరొకరు రామానుజాచార్యులు. వాదాలు, ప్రతివాదాలు. పగలంతా వాళ్లతో సరిపోతోంది...”

రాజారావు పకపకా నవ్వేసీ అన్నాడు. “పోన్లే, నీ మనుమలు ఎదిగి నాస్తికులుగా అవరు. పైగా జీవితం అంటే ద్వైత, అద్వైతాల మిశ్రమం అని పరోక్షంగా నీకు చెబుతున్నారు”.

“ఇప్పుడు రెండో అమ్మాయికి నెలలు నిండాయి అని నాస్తిక మహాశయులైన ఏ గోరాగారినో, లేకపోతే కావూర్‌నో కంటుందని భయంగా ఉంది.”

“బావుంది నీ జోస్యం.” రాజారావు మళ్ళీ నవ్వాడు.

“అవునయ్యా. నా రెండో వియ్యంకుడు గోరాగారి ప్రథమ శిష్యుడు. ఆయన మొన్నే పోయాడు. దీని కడుపులో ఆయనే దాగున్నాడని నా అనుమానం.” ముకుందరావు కూడా నవ్వుతూనే అన్నాడు.

“ఏం భయపడకు. రామకృష్ణ పరమహంసనో, శ్రీ అరబిందోనో, లేకపోతే సాయిబాబానో నీకు మనుమడిగా పుట్టమని ప్రార్థించు. ఎలాగూ నువ్వు వేదాంతివే కదా.”

"ఆ పనే చెయ్యాలి."

"మన సృష్టికర్త బహు నేర్పరి ముకుందం! మనుషుల్ని సృష్టిస్తూనే భవబంధాలనే ఓ రతనాలమారం వాళ్ళ మెడల్లో వేసి కిందకి పంపిస్తాడు. చూడు, ఇక అసలు కథ అప్పటితో మొదలవుతుంది. దాన్ని తీయలేం, ఉంచుకోనూ లేం."

"అవునవును."

"నీకు చెప్పలేదు ముకుందం, మొన్న ఓ రాత్రివేళ నాకు మైల్డ్‌గా గుండెల్లో నొప్పి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేరు. అందరూ పెళ్ళికి వెళ్లారు. ఉదయమేలేచి హాస్పిటల్‌కి పరిగెత్తాను. శరీర దార్ఢ్యం తగ్గిపోతుంటే భయం పెరుగుతోంది కాబోలు...."

"భయపడకు, నీకేం కాదు, అంతా స్వామే చూసుకుంటారు."

"నాకు బతుకు మీద తీపీ, అదే చిరకాలం బతికి ఏదో మూటగట్టుకోవాలనే ఆశా లేదు. కానీ, మంచాన పడి తీసుకుని చావకుండా ఉంటే చాలు. ఈ వయసులో ఒకళ్ళ చేత చేయించుకొనే ఖర్మ పట్టకుండా ఉంటే అదే పదివేలు.

"నీ మంచితనమే నిన్ను కాపాడుతుంది రాజారావ్. నాకు తెలుసు, నువ్వు నిష్కల్మషంగా, నిజాయితీగా బతికావు. ఉన్నంతలో ఒకళ్ళకి పెట్టావు, ఏమీ కాదు."

"పాపీ చిరాయువు అంటారు. ఆ మాట నాపట్ల నిజం కాకపోతే చాలు."

"బతికి వున్న సుఖములు బడయవచ్చునని ఇంకో మాట కూడా అన్నారు. మర్చిపోకు అందులోనూ ఓ అంతరార్థాం ఉంది. మనసును, హృదయాన్ని నిర్మలంగా ఉంచుకుంటూ ఆత్మావలోకనం మీద దృష్టి సారిస్తూ ఉంటే మనిషి శతాయుష్షు, ఆపైన చిరంజీవీ కూడా కావచ్చు."

"అంతలా కష్టపడడానికి శరీరం మొరాయిస్తుంది కదయ్యా."

"ఇందులో కష్టమేమీ లేదు. అంతా క్రమశిక్షణే. మనవాళ్ళు, పరాయివాళ్ళు అనే తేడా చూపించకూడదు. ఉపకారం చేసినవాళ్ళనూ, అపకారులనూ ఒకే దృష్టితో చూడాలి. ఇక మన బాధల్నీ, ఆనందాల్నీ భగవంతుడికే అర్పితం చేయగలగాలి. 'నా జీవితాన్ని వెళ్ళదీయడంలో నాతోపాటు నీ ప్రమేయం కూడా ఉంది. నా మాటలోంచి, క్రియలోంచి, ఆత్మలోంచి నువ్వు తప్పుకోకు' అని ఆయన్ని నిత్యం వేడుకోవాలి."

"తెలియక పాపాలు చేస్తూ ఉంటాం. పాప పరిహారార్థం ఏదో ఒకటి చెయ్యాలి కదా. అందుకే నేను ఏడాదికి రెండుసార్లు తిరుపతి వెళతాను. కళ్యాణం చేయిస్తాను. ఒక్కొక్కసారి ఇదీ స్వార్థమే అనిపిస్తుంది. ఏదీ అర్థం కాదు."

ముకుందరావు చిన్నగా నవ్వి అన్నాడు, "రాజారావ్, ఒకటే గుర్తు పెట్టుకో. ఏమైనా సరే చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. అంటే, రియలైజేషన్ రావాలన్నమాట. పరమాత్మకు దగ్గరయ్యే ప్రయత్నాలే ఈ పూజలూ, ధ్యానాలు. ఇలాంటి సకర్మలు మనకూ, ఆయనకూ మధ్య ఉండే దూరాన్ని తగ్గిస్తాయి."

రాజారావు చేతివాచీ చూసుకొని, "టైము ఆరు దాటుతోంది. వాకింగ్‌కు వెళదామా మరి" అని అడిగాడు.

"నీదే ఆలస్యం."

"నాదో అనుమానం ముకుందం! ఎప్పటి నుంచో నిన్ను అడగాలనుకుంటున్నాను. నేనేమో అడక్కుండానే నా బాధలు చెప్పుకుంటాను, వాగుతాను, కిందా మీదా అవుతాను. కానీ, నువ్వు నిమ్మకు నీరెత్తినట్టు ఎలా ఉంటావయ్యా? ఆ కిటుకేమిటో చెప్పరాదా" అన్నాడు రాజారావు.

"ఏం లేదు నేను దేనికీ భయపడను. నా ప్రయత్నం నేను చేస్తాను. ఎప్పుడూ క్రియాశీలిగా ఉండడానికి ప్రయత్నిస్తాను. ఇబ్బందులు, కష్టాలు, ఘర్షణలు ఎదురైనప్పుడు ఎక్కువగా నా హృదయం మీద ఆధారపడతాను. అలాగే మనసుకు తక్కువ ప్రాధాన్యం ఇస్తాను" అంటూ ముకుందరావు కుర్చీలోంచి లేచాడు.

❖ ❖ ❖

భార్య పార్వతి మాటలు విని రాజారావు ఆగ్రహోదగ్రుడయ్యాడు. ఆఖరిగా మూడో కన్ను కూడా తెరిచాడు. అయినా పార్వతి మాత్రం, 'చాల్లెండి,' 'తప్పు,' 'వద్దు,' 'ఊరుకోండి,' లాంటి మాటలతో భర్తను పుష్పార్చన తీరున కదిలిస్తూ, ఆపైన 'నా మాట వినండి,' 'వాసు పరాయివాడా' 'వాడి మనసు గాయపడుతుంది,' 'ఆలోచించండి' అంటూ పంచామృతాల మేలు కలయిక లాంటి ఉపదేశసారాన్ని అందివ్వబోయింది.

రాజారావు మాత్రం అటూ ఇటూ కలియదిరుగుతూ, "వాడు ప్రేమలో పడ్డాడా. వాడికి బుద్ధుందా? అసలు వాడిది కాదు తప్పు, నీది" అంటూ హుంకరించాడు.

పార్వతి జవాబివ్వలేదు.

చెప్పు, నేనా రిటైరైన వాణ్ణి, అలాంటిది వీడు కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటాడా? ఎంత తెగింపు! అదీ కులం కాని పిల్లను... నాకు తలవంపులు తేదల్చుకున్న వాణ్ణి ముందు నరకాలి."

అయినా, పార్వతి మూర్తిమంతంగానే ఉండిపోయింది.

"నా మాటగా వాడితో చెప్పు. నా ఎర్నింగ్స్‌లో వాడికి ఒక్కపైసా ఇవ్వను. నువ్వేం వాడికి వంత పాడొద్దు... నీ ఉద్దేశం ఏమిటి? నువ్వేం చేయదలచుకున్నావ్?"

"నేనేం చేయగలనండీ ఇందులో! జరిగింది మీకు చెప్పాను. జరగబోయేదానికి ఒడిపడతాను. ఎవరైనా సరే కాలంతో పాటు మారాలి. అలా మారని వాళ్ళు తమకు ఎదురయ్యే కష్ట నష్టాలు భరించవలసి వుంటుందని నచ్చజెప్పజూస్తాను.

"పిల్లలకు – వాళ్లన్నదానికి సయ్యంటే సయ్యనడం ఆదర్శం అవదు. గుర్తుంచుకో."

❖ ❖ ❖

చిన్నప్పుడు నేను ఆదర్శవంతుడి కడుపున పడ్డందుకు ఎంతో సంతోషించేదాన్ని. ఆ

తర్వాత మీలాంటి మంచి మనిషి చేత మూడు ముళ్ళూ వేయించుకున్నందుకు గర్వపడ్డాను. ఇంతకాలం కాపురం చేసి వయసుతోపాటు అనుభవాలు మూటగట్టుకున్న తరువాత ఎవరికైనా సరే మంచితనం, కలుపుగోలుతనం మంచే చేస్తాయని గ్రహించాను."

"కవిత్వాలు, కథలు చెబుతున్నావ్. నోర్ముయ్."

"మౌనంగా ఉండగలగడం కూడా ఒక కళే! అది నెమ్మదిగా వేదాంతానికీ, ఆధ్యాత్మికతకూ దారి చూపిస్తుందని మీరే ఎన్నోమార్లు చెప్పగా విన్నాను."

"చాల్లే ఊరుకో. ఇంతకీ ఆ అమ్మాయి ఎవరుట? ఎలా పరిచయం అయ్యిందిట?" కొడుకు వాసు వర్ణించి చెప్పిన కల్యాణి అనే అమ్మాయి గురించి అంతా చెప్పి, ఆపైన పార్వతి, "ఆ అమ్మాయి ఎవరో కాదండీ, మీ ప్రాణస్నేహితులైన ముకుందరావుగారి సుపుత్రికట" అంది.

"ఆఁ" అన్నాడు ఆశ్చర్యపోతూ రాజారావు.

"ఇప్పుడు చెప్పండి. ముప్పై ఏళ్ళ మీ స్నేహం వదులుకుంటారా? న్యాయమా? కల్యాని మనందరికీ తెలిసిన అమ్మాయి. పరాయిది కాదు. కానైతే కులం వేరు. అంతేగా."

రాజారావు మాట్లాడలేదు. బొమ్మలా ఉండిపోయాడు.

"ప్రేమించుకున్న వాళ్ళను విడదీయడం పాపం అండీ! ప్రేమలోనే భగవంతుడు ఉంటాడు. మనం కనుక వాళ్ళను ఆశీర్వదిస్తే భగవంతుడు మనపక్షాన ఉంటాడు. పైగామనం కక్షలకూ, కలతలకూ పోకూడని, దరిచేరనీయకూడని వయసులో ఉన్నాం, మీరు దత్తాత్రేయుణ్ణి పూజిస్తారు, షిర్డీ, పుట్టపర్తి వెళతారు. అక్కడి స్వాములు ప్రవచనాలు వింటారు. మరోసారి ఆలోచించండి" అంది ప్రాథేయపూర్వకంగా పార్వతి.

రాజారావు అలానే పార్వతి వైపు కొరకొరా చూశాడు. అంతేగాని నెమ్మదించలేదు.

"నేను లోపలికి వెళుతున్నాను. మీరు మాత్రం అనవసరపు ఆలోచనలు పెట్టుకోకండి. ప్రశాంతంగా ఆలోచించండి. ఓ కప్పుడు కాంప్లాన్ కలిపి తేనా, తాగుదురు గాని" అంటూ పార్వతి లోపలికి వెళ్లింది.

❖ ❖ ❖

"ఇదేమిటి నువ్వు రెండు రోజులుగా వాకింగ్‌కు రావడంలేదు. ఊరికిగానీ వెళ్ళావా" అంటూ గేటు తెరుచుకుని లోపలికి వస్తున్న ముకుందరావును చూసి రాజారావు అదోలా ముఖం పెట్టాడు. అయిష్టంగానే కుర్చీ చూపించాడు.

"అలా వున్నావేమిటి రాజారావ్? ఏమైంది?"

"మనసు బావుండలేదు."

"అంతేకదా." ముకుందరావు నవ్వేశాడు.

"అదేమిటి, అంత తేలిగ్గా మాట్లాడుతున్నావ్?"

అవును. మనసు ఒకప్పుడు బావుంటుందేమిటి! అది నిత్య రోగి. ఆలోచనల్ని కట్టడి

చేసుకోవడం ఒకటే దానికి తగిన వైద్యం."

రాజారావు మాత్రం నెమ్మదిగా తనని తాను అదుపులో పెట్టుకుంటూ, "నువ్వా డల్‌గానే కనిపిస్తున్నావ్" అనేశాడు.

"నువ్వన్నట్టు నిన్నంతా నాకూ అలానే ఉంది. గుండె కాస్త చలించింది. కష్టపడి తిరిగి దాన్ని ట్రాక్‌లో పెట్టాను. ఎనీహౌ, నౌ అయామ్ ఆల్‌రైట్."

"ఏమైంది?"

"ఏమందీ! మా కల్యాణి నిన్న ఇంట్లో ఓ ఆటంబాంబు పేల్చింది."

"అంటే..."

"ఎవరో స్నేహితుడూ, తోటి ఉద్యోగస్థుడూనట. తానూ, అతనూ ప్రేమించుకున్నారట. నన్ను క్లియరెన్స్ ఇవ్వమని అడిగింది. పైగా అతను మా కులస్థుడు కాదు. అంతా విని ఓరోజు గడువు అడిగాను."

"అలానా."

"నేను తీసుకోబోయే నిర్ణయం నన్ను తలెత్తుకునేటట్టు చేస్తుందో, వెతలతో తల దించుకునే స్థితికి లాగుతుందో తెలియడం లేదు. అందుకే నీ సలహా అడగడానికి వచ్చాను."

రాజారావు మాట్లాడలేదు. ఓసారి ముకుందరావు ముఖంలోకి చూసి ఊరుకున్నాడు.

"అదేమిటి మౌనంగా ఉండిపోయావ్? ఆలోచిస్తున్నావా? జాగ్రత్తగా విను. మా కల్యాణి మైనర్ కాదు. ఈవేళ ఏదో విధంగా దాన్ని కట్టడిలో పెట్టచ్చు? వేరే పెళ్ళీ చెయవచ్చు. కానీ, అది న్యాయం అవుతుందా? ఈ కోణం నుంచి కూడా ఆలోచించు."

రాజారావు నెమ్మదిగా అన్నాడు, "ముకుందం, నేనూ నీ మాదిరిగానే ఓ గొప్ప చిక్కులో ఇరుక్కున్నాను. మా ఆఖరివాడు వాసుగాడు కూడా ఇలాంటి సమస్యే నా ముందు పెట్టాడు. కానీ చెప్పద్దూ. నేను మాత్రం వాడికే అలుసూ ఇవ్వలేదు. గట్టిగా నిలబడ్డాను."

ముకుందరావు కళ్ళజోడు సర్దుకుని రాజారావు వైపు సానుభూతిగా చూశాడు.

"అవును ముకుందం, పిల్లలు ఎప్పుడూ ఆవేశపరులే అయ్యుంటారు. వాళ్ళకు బుద్ధి సరిగా పనిచేయదు. కనపడ్డ ప్రతిమనిషీ, ప్రతి వస్తువూ కూడా తమ కోసమే పుట్టాయని భ్రమపడతారు."

ముకుందరావు ఏమీ మాట్లాడలేదు.

"మనం వాళ్ళమీద వెర్రి ప్రేమతో వాళ్ళ చేష్టలకు వంతపాడితే చేతులారా వారి భవిష్యత్తును పాడుచేసిన వాళ్ళమవుతాం. ఇలాంటి విషయాల్లో వేదాంతం పనిచేయదే. అమ్మాయిని బెదిరించు, లేకపోతే మీ ఆవిడతో, ఆమె అక్కలతో చెప్పించు."

"ఒక వేళ అది ఎవరి మాటా వినకపోతే... ఆపైన జరిగే...."

"భయపడుతున్నావా?"

"ఇది భయం అనుకోకు. ఇదో రకం డైలమా. నిజానికి మా కల్యాణి తెలివైంది,

బుద్ధిమంతురాలు. ఆవేశంతో అది ఏ నిర్ణయమూ తీసుకోదు. అదీ నన్ను నమ్మి, నా ముందు నిలబడి నిజం చెబితే, నేను దాన్ని ఆశీర్వదించడం మానేసి కట్టడి చేయడం మంచిపని అవుతుందా? దేవుడు హర్షిస్తాడా? చెప్పు."

"ఈ రెండో తరహా ఆలోచన కూడా స్వామి కలగజేసిందే అని అనుకోరాదా?"

"అలా అంటావా" అంటూ ముకుందరావు అదోలా రాజారావు వైపు చూశాడు.

"చెప్పడం మరిచిపోయాను. నేనీ రోజు వాకింగ్‌కు రాలేనయ్యా. ఏమీ అనుకోకు."

"దానికేముంది. నేను వెళ్ళి వస్తాను. అంటూ ముకుందరావు కుర్చీలోంచి లేచాడు.

"ఇంతకీ మీ అమ్మాయి ప్రేమించిన ఆ ప్రబుద్ధుడు ఎవరుట?"

"ఆ వివరాలేవీ అది చెప్పలేదు" అంటూ ముకుందరావు బయటకు అడుగులు వేశాడు.

సరిగ్గా అప్పుడే లోపలి నుంచి పార్వతి డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి, "ఆయనేమంటారు" అని అడిగింది.

పార్వతి ముఖంలోకి కోపంతో చూసి రాజారావు, "ఏమీ అనలేదు. ఏం? ఆత్రం ఆపుకోలేక అడుగుతున్నావా? వాసుగాడు అడగమన్నాడా" అని పార్వతిని గదిమాడు.

"మీతో సంబంధం గురించి మాట్లాడ్డానికి వచ్చారనుకున్నాను."

"అమ్మో! ఈ ముకుందరావు చాలా తెలివైనవాడని ఇప్పుడే తెలిసింది. వినయాలు పోతున్నాడు. ఇది కూడా వేదాంతమే నేర్పుతుంది కాబోలు. ఈయనకు అన్నీ తెలుసు."

"అది సరేనండి. వాసు నిన్న అనగా బయటకు వెళ్లాడు. ఇంతవరకూ రాలేదు. నాకు భయంగా ఉందండీ. వాడు మీ అరుపులకు భయపడి ఎటన్నా పోయాడేమో" అంటూ వచ్చే దు:ఖాన్ని పైట కొంగు చాటున దాచుకుంది.

"ఏమంటావ్ అయితే? నన్ను వెళ్ళి వెదకమంటావా? ముందు నువ్వు లోపలికి పో" అంటూ రాజారావు ఓ పొలికేక పెట్టాడు.

పార్వతి అదోలా మారి నెమ్మదిగా పడగ్గదిలోకి వెళ్ళి మంచం మీద వాలింది.

అప్పుడు రాజారావు హాల్లో అటూ ఇటూ తిరిగి కుర్చీలో కూలబడ్డాడు. ఆపైన అక్కడే ఉన్న దివాన్‌మీద వాలాడు. ఆయన ఆలోచనలు ఎటో పోసాగాయి. వాసు గురించి అతని స్నేహితులకు ఫోన్ చేశాడు. కావలసిన సమాచారం దొరకలేదు. ఒకళ్ళిద్దరు వాసు ఆఫీసుకు పోనట్టుగా చెప్పారు. దాంతో రాజారావుకు ఏం చేయాలో తోచలేదు. గోడలన్నీ చదివాడు. ఆ గోడలకున్న దేవళ్ళను పలకరించాడు మౌనంగా! అయినా, తన మనశ్శాంతిని అక్కడ కనపడకుండా రాజ్యమేలుతున్న నిశ్శబ్దం కబళిస్తూ వుంటే అదోలా మారిపోసాగాడు. వాసు తనని ఎదిరించినట్టు, తెరవెనక నుంచి పార్వతి కొడుక్కి వంతపాట పాడుతున్నట్టు, అలాగే ముకుందరావు కూడా పరోక్షంగా కూతుర్ని ప్రోత్సహించినట్టు, ఆపైన వాసు, కల్యాణి రహస్యంగా రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేసుకున్నట్టు, దాంతో తాను ప్రళయకాల రుద్రుడై వాసును ఇంటినుంచి తరిమివేసినట్టు, అలా అలా....

అంతే! రాజారావు దివాన్ మీద అటూ ఇటూ పొర్లాడు. ఆయనకు తన గుండె కలుక్కుమన్నట్టయింది. ఆ పైన చెమటలు, నోరు తెరవబోయాడు. మాట బయట పడలేదు. అంత నిస్సత్తువలోనూ రాజారావు తనకు దగ్గరగా ఉన్న టీపాయ్‌ని ఓ తన్ను తన్నాడు. పెద్దగా చప్పుడయింది. ఆ చప్పుడుకు పడగ్గదిలో ఉన్న పార్వతి లేచి, హాల్లోకి వచ్చి భర్తను చూసి హడలిపోయింది. భయపడి ఫోన్ దగ్గరకు పరుగెత్తింది.

❖ ❖ ❖

రాజారావును హాస్పిటల్లో జాయిన్ చేశారు. స్ట్రెస్ టెస్ట్ చేశారు. ఇ.సి.జి. అయింది. ఆపైన యాంజియోగ్రామ్ టెస్ట్ కూడా జరిగింది. పార్వతి, కొడుకులు, కోడళ్ళు ఎన్నో రకాలుగా రాజరావుకు ధైర్యం చెప్పారు. భయపడవలసింది ఏమీ లేదనీ, గుండెకు బైపాస్ సర్జరీ లాంటిది అవసరం ఉండదనీ చెప్పారు. రాజారావు అయిన వాళ్ళందరి మాటలూ విన్నాడు. అందించిన సానుభూతినీ అందుకున్నాడు.

ఆ రోజు ఉదయం వాసు ఒక్కడూ తండ్రి పక్క కూర్చుని ధైర్యం చెప్పాడు. ఆఖరిగా మాత్రం, “అందరూ నా మూలంగానే నీకు హార్ట్ ఎటాక్ వచ్చిందంటున్నారు నాన్నా! నువ్వీ విషయాన్ని ఇంతలా తీసుకుంటావని నేను అనుకోలేదు” అన్నాడు.

రాజారావు మాట్లాడలేదు.

“నువ్వు అనవసరపు ఆలోచనలు మానెయ్ నాన్నా.”

“జరగవలసిందేదో జరిగి తీరుతుందంటావ్, అవునా?”

“నీకు పూర్తిగా ఆరోగ్యం చక్కబడేదాకా నేను పెళ్ళి చేసుకోను. సరేనా.”

రాజారావు చిన్నగా నవ్వేసి, “నేను నీ దగ్గర నుంచి ఆశించే వాగ్దానం ఇది కాదోయ్. అది వేరే వుంది” అన్నాడు గుంభనంగా.

వాసు జవాబుగా ఏదో చెప్పబోయాడు. సరిగ్గా అప్పుడే ఆ దగిలోకి డాక్టరూ, నర్స్ వచ్చారు. పల్స్ చూశారు. బి.పి. చూశారు.

అంతలోనే ఇంటి నుంచి పార్వతి వచ్చింది.

తండ్రికి క్యారియర్ తేవడానికీ, మందులు కొనడానికీ వాసు బయటకు వెళ్ళాడు.

పార్వతి భర్త పక్కన సోఫాలో కూర్చుని ఓసారి ఆయన నుదుటిమీద చెయ్యేసి చూసింది. దుప్పటీ, పంచె, చొక్కా సరిజేసింది. ‘హార్లిక్స్ తాగుతారా, ఇవ్వమంటారా’ అని అడిగింది. ఇంటి విషయాలు మాట్లాడింది.

అదే సమయంలో బయట నుంచి ముకుందరావు లోపలికి వచ్చాడు. పార్వతి ఆయన్ని చూసి సోఫాలోంచి లేచి నమస్కారం చేసింది.

ముకుందరావు ఆమెకు సమాధానంగా మౌనంగా చూసి, రాజారావు మంచం పక్కన నిలబడి, “ఎలా వుంది రాజారావ్? నాకీ విషయం నిన్న రాత్రే తెలిసింది. మనసు ఆగింది కాదు. వచ్చేశాను” అన్నాడు.

"ఏం చెప్పను, అంతా నా తలరాత."

"బాధపడకు."

పార్వతి అక్కడ ఉన్న ర్యాక్ తెరచి, డాక్టర్ రిపోర్టులు తీసి ముకుందరావు చేతికి ఇచ్చింది.

ముకుందరావు అవి చూసి పార్వతితో, "మీరూ భయపడొద్దు. రాజారావుకు ఏమీ కాదు. అంతా ఆ స్వామే చూసుకుంటారు" అని ధైర్యం అందించాడు.

రాజారావు తల ఊపి నవ్వాడు. పార్వతి నెమ్మదిగా ఆ గదిలోంచి బయటకు వెళ్ళింది. ఆమె వెళ్ళడం చూసి ముకుందరావు అన్నాడు, "నీకిలాంటి ప్రమాద స్థితి రావడానికి కారకులం నేనూ, నా కూతురూనూ. అది నాకంతా చెప్పింది. దాన్ని నేను బాగా మందలించాను. నువ్వు నన్ను క్షమించు. నేను దానికి వేరే సంబంధం చూస్తాను. ఇదే మాట వాసుతో కూడా చెప్పు."

"అది కాదు..." రాజారావు ఏదో చెప్పబోయాడు.

"నువ్వు రెస్ట్ తీసుకో. నే వెళతాను" అని ఒక్క క్షణం ఆగి, "నాకు ఒక్కణ్ణీ వాకింగ్‌కు వెళ్ళాలంటే విసుగనిపిస్తోంది. నువ్వు తిరిగి ఇంటికి రాగానే మనం మన రొటీన్‌లో పడదాం, ఉంటాను" అని ముకుందరావు బయటకు వెళ్ళాడు.

❖ ❖ ❖

వారం తరువాత – గేటు దగ్గర నిలబడి తన పేరు పెట్టి కేకేసిన రాజారావును చూసి, ముకుందరావు ఆయనకు ఎదురువెళ్ళి ఇంట్లోకి ఆహ్వానించాడు.

"ఎలా ఉంటోంది ఒంట్లో? తిరిగి రొటీన్‌లో పడ్డావా?"

"ఆఁ తిరిగి మనుషుల్లో పడ్డాను. ఏ రకమైన ఆపరేషనూ అవసరం లేదన్నారు. అయితే, డాక్టర్లు మాత్రం ఓ కిలో బరువు తూగే మందు బిళ్ళలు రాశారు. నిల్చుంటే మందు, కూర్చుంటే మందు. ఇంట్లో వాళ్ళందరూ నన్ను వేయి కళ్ళతో కాపలా కాస్తున్నారు."

"తప్పదు కదా!"

"వాకింగ్ మానకుండా చేయమన్నారు. ముఖ్యంగా మనసును ప్రశాంతంగా ఉంచుకోమన్నారు."

అప్పుడే లోపలి నుంచి కల్యాణి ట్రేలో రెండు కప్పుల కాంప్లాన్ తెచ్చి రాజారావుకూ, తండ్రికీ ఇచ్చి, "నమస్తే అంకుల్! ఎలా ఉన్నారు" అని పలకరించింది.

రాజారావు, "బావున్నానమ్మా, నువ్వెలా వున్నావ్? కొంచెం చిక్కినట్టు కన్పిస్తున్నావ్ " అన్నాడు.

"లేదు అంకుల్. నేను బాగానే ఉన్నాను." అంటూ కల్యాణి తిరిగి లోపలికి వెళ్ళి పోయింది.

"వాకింగ్‌కు బయలుదేరదామా మనం"

"నేను తయారుగా ఉన్నాను."

ఇద్దరూ అలవాటుగా రెండు కిలోమీటర్ల దూరం నడిచారు. ముకుందరావు ఆ వారం రోజుల్లో తానుకలిసిన పాత స్నేహితుల గురించి చెప్పాడు. ఊళ్ళోకి వచ్చిన ప్రముఖ స్వాముల గురించీ, వారి తాత్త్విక ప్రసంగాల తీరూ వివరించాడు. ఆ తరువాత ఇద్దరూ వెళ్ళి అక్కడే ఉన్న పార్క్‌లో కూర్చున్నారు. అప్పటికే చీకటి పడింది.

"ముకుందరావ్! నా ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రంగా ఉందని నాకు అర్థమైంది. అందరూ ధైర్యం అందిస్తున్నారు. అది వేరు. ఆలోచిస్తూ వుంటే నా జీవితంలో మూడొంతులు పైబడి నిరర్థకంగానే గడిపేశానని ఇప్పుడు తెలుస్తోంది. ఇక పైవాడి నుంచి పిలుపు ఎప్పుడైనా రావచ్చు. అందుకే బాగా ఆలోచించి ముందు జాగ్రత్తతో పైకి వెళ్ళడానికి సకల సన్నాహాలు చేసుకోవాలని ఉంది. అయినా, అదేమిటో గానీ అప్పుడప్పుడు ఏదో ఓ లంపటం, మరేదో ఓ అపేక్ష 'నా సంగతేం చేశావ్' ని వెనక్కి లాగుతున్నట్టుగా ఉంటుంది. దీన్నేమనాలి? ఇది స్వార్థమా' అంటూ ముకుందరావును ప్రశ్నించాడు రాజారావు.

ముకుందరావు చిన్నగా నవ్వేశాడు." అది స్వార్థం కాదు. జీవితం పట్ల మమకారం కావచ్చు. అయినవాళ్ళ మీద తెంచుకోలేని ప్రేమ తాలూకు నీడల ప్రభావం అవచ్చు. ఇంకాపోతే మనకు సృష్టికర్త ఉనికి మీద అపనమ్మకమైనా కావచ్చు."

దేవుడికి దగ్గరగా, అతి దగ్గరగా జరుగుతూ ఉండడమే మన వయసుకు శోభనిస్తుంది. నువ్వోసారి అన్నావ్, నాకు గుర్తుంది, అయితే, మనం నమ్మిన శ్రీవారు మనకు ఏ ఉపకారమూ, మేలూ చేయలేదనుకో, అలాంటప్పుడు మనకు వారిమీద గురి తప్పుతుంది కదా! ప్రస్తుతం నేనీ డోలాయమాన స్థితిలో ఉన్నాను. ఏదీ తోచదు."

రాజారావుకు నచ్చజెప్పే ధోరణిలో అన్నాడు ముకుందరావు, "రాజారావ్, మనిషికి ఊగిసలాటలూ, ఈ ఊపులూ తప్పవు. వీటినే అగ్ని పరీక్షలంటారు. ధైర్యంగా నిలబడాలి. నీ పరిస్థితిలో కనుక నేనుంటే మరింత పట్టుదలతో ఆయనకు దగ్గరగా వెళ్ళడానికి ప్రయత్నిస్తాను. మనకు జరిగే మంచి చెడులకు కారకులం మనమే అయ్యుంటాం. ఒక ఉదాహరణ, ఏ చెట్టూ తన కొమ్మలకూ, రెమ్మలకూ పూసే అన్ని పూవులూ పిందెలవుతాయనీ, అవి కాయలుగానూ, ఆపైన అవి రాలపోకుండా పక్వదశకు చేరతాయనీ అనుకోదు. ఏది ఏమైనా, తన అనుభవ సారాన్ని నిత్యం ప్రతి వేరు ద్వారా ఆకు ఆకుకూ అందిస్తూనే ఉంటుంది. మనిషి తోటి ప్రాణుల నుంచి, ముఖ్యంగా ప్రకృతి నుంచి, పశుపక్ష్యాదుల నుంచి, మహా వృక్షాల నుంచి జీవించడం ఎలానో నేర్చుకోవాలి."

తరువాత ముకుందరావు మాటలు ఆపి రాజారావు వైపు చూసి, "లే వెళదాం. బాగా చీకటి పడింది" అన్నాడు.

"ముకుందం, నీతో ఓ చిన్నమాట చెప్పాలని ఉంది. చెప్పమంటావా?"

ముకుందరావు వెంటనే, "సంశయం ఎందుకు? చెప్పు, యూ ఆర్ ఎట్ లిబర్టీ"

అన్నాడు.

"నే చెప్పే మాటలు నా నాలిక చివర నుంచి వస్తున్నవి కావు. ఇది నా హృదయ నివేదన అనుకో."

"చెప్పు"

"అయితే విను. మా వాసుకీ, మీ కల్యాణికీ పెళ్ళి జరిపిద్దాం ఏమంటావ్?"

ముకుందరావు ఆశ్చర్యంగా రాజారావు వైపు చూశాడు.

"నేను నీలాంటి మంచి మనిషితో వియ్యం అందుకోవడానికి వెనుకాడి పొరపాటు చేశాను. పాపం పార్వతి ఎంతగానో నచ్చజెప్పింది. మొండికేశాను. ఆ తరువాత పైవాడు పరోక్షంగా నీ గురించి చెప్పాడు. అప్పుడు అంతా అర్థమైంది."

ముకుందరావు తిరిగి రాజారావు ముఖంలోకి చూశాడు. రాజారావు తిరిగి అన్నాడు. "నువ్వు వెంటనే 'ఊఁ' అని నాతో చేతులు కలుపుతావనుకున్నాను ముకుందం!"

ముకుందరావు తలవంచుకొని అక్కడ నేలమీద మొలచి ఉన్న గడ్డి మొక్కల్ని తెంపుతూ నెమ్మదిగా అన్నాడు, "చూడు రాజారావ్, మనం ఇన్నాళ్ళూ స్నేహంగా ఉన్నది ఫక్తు మనకోసమే గానీ, మన పిల్లలకోసం, పిల్లల గురించి ఏర్పడింది కాదని నా ఉద్దేశం. కాలక్రమంలో ఇద్దరు వ్యక్తులు అతి దగ్గరగా, ఆత్మీయంగా ఉండగలిగారంటే, బహుశా వాళ్ళ ఆత్మలు ఒకే కోవలోవి, ఒకే మూసలోవి అయ్యుండాలి. మనిద్దరి గురించీ నేనెప్పుడూ ఈ ధోరణిలోనే ఆలోచిస్తూ ఉంటాను. ఇంకపోతే భగవంతుడు నిన్ను భయపెట్టి, లేకపోతే గుణపాఠం నేర్పడం కోసం నిన్నిలా అనారోగ్యం పాలు చేశాడని ఎప్పుడూ అనుకోకు. ఆయన్ని ఈ దృక్కోణం నుంచి చూసీ, ఊహించీ తక్కువగా అంచనా వేయకూడదు. గత జన్మ... ఇంకా, ఇంకా వెనకటి జన్మలు, అక్కడి మన పొరపాట్లూ కాస్తంత వెన్నంటి ఉంటాయిట. ప్రమాదాలూ, మరణాలూ అంటావా అవి అతి సహజం. అంతేగానీ..."

రాజారావు అదోలా ముకుందరావు వైపు చూశాడు. ఆపైన అన్నాడు, "నేను దేవుణ్ణీ, దైవత్వాన్నీ సరిగ్గా అవగాహన చేసుకోలేదు ముకుందరావు. నిజమే, కానీ, అందకు నాందిగా నా కొడుకు ముద్దు చెల్లించి ఓ అడుగు ముందుకు వేయాలనుకుంటున్నాను. ప్లీజ్ ముకుందం! నువ్వు నాకు హితుడివి, స్నేహితుడివి. నువ్వు నా కోరిక తీరిస్తే అప్పుడు పరమాత్మకూ నామీద మరింత గురి కలుగుతుంది. ఆయన నీకు దగ్గరయినట్టే నాకూ దగ్గరవుతాడు. మిత్రుడగా మారతాడు. సరేనా?"

ముకుందరావు ఆనందంగా, ఆశ్చర్యంగా చూసి, ఆపైన హృదయపూర్వకంగా నవ్వేస్తూ రాజారావు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.